క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఉయ్యూరు: 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నామని ఆర్టీసీ ఉయ్యూరు డిపో మేనేజర్ కేఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడిస్తూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. 99592 24796 నంబరుకు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు, సమస్యలు తెలియజేయాలని ఆయన కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీ పార్వతీదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. స్వామివారికి అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీచెన్నకేశవ స్వామి కల్యాణం



పెనమలూరు: పోరంకి గ్రామంలో శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామివారి సప్తమ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా చేశారు. ఉదయం ఆలయంలో మంగళవాయిద్య గోష్టి, సుప్రభాతసేవ, 8 గంటలకు నిత్యహోమం, లక్ష్మీగణపతి హోమం చేశారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ విష్ణుసహస్ర నామపారాయణ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామివారికి, శ్రీ రమాసహిత శ్రీ సత్యనారాయణస్వామివారికి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా చేశారు. మంగళవారం మధ్యాహ్నం గ్రామోత్సవం చేస్తారు. ఈ నెల 29వ తేదీన భక్తులకు అన్నసమారాధన ఉంటుంది.

విజేతకు సత్కారం

కంకిపాడు: మధ్యాహ్న భోజన పథకంపై ఇటీవల నిర్వహించిన పోటీల్లో పాల్గొని కృష్ణా జిల్లాకు ప్రథమ స్థానం తెచ్చిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు బాకీ శివమ్మ, అన్నవరపు వసంతలక్ష్మిలకు సోమవారం కంకిపాడు మండల రీసోర్సు సెంటర్‌లో సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు శేషగిరిరావు, కె.ప్రసాద్ పాల్గొని విజేతలను అభినందించారు. సీఐటీయూ నాయకులు కె.యలమంద, బాకీ ఏడుకొండలు, మల్లీశ్వరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

రామవరప్పాడు: యుక్త వయస్సులో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ఏరియాలో సోమవారం 'రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని' పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సులోపు ఉన్న బాలికలు నెలసరి సమయంలో వచ్చే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శానిటేషన్ ప్యాడ్‌ల వినియోగం పట్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టిక ఆహార పదార్థాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెనేజర్ రీటా, శారదా, కిశోర బాలికలు, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. 4,001 ర్యాంకు నుంచి 8వేల ర్యాంకు వరకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 48 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. కార్యక్రమాలను అధ్యాపకుడు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. మంగళవారం 17,001 నుంచి 22వేలు ర్యాంకు వరకు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు.

జగనన్న కాలనీకి మార్గం సుగమం



ఏలూరు కాలువపై వంతెన నిర్మించే ప్రాంతం



కేసరపల్లిలో జగనన్న కాలనీ

- ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి రంగం సిద్ధం
- రూ.3 కోట్లు కేటాయింపు
- 3,198 మంది జగనన్న కాలనీ వాసులకు మేలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోనే అతిపెద్ద వైఎస్సార్ జగనన్న కాలనీకి మార్గం సుగమమైంది. కేసరపల్లి శివారులోని ఈ కాలనీకి వెళ్లేందుకు రహదారి కోసం ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించడంతో పాటు టెండర్ ప్రక్రియను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది. అయితే ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు మంజూరులో ఎదురైన అడ్డంకులను అధిగమించి వంతెన నిర్మాణం దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరితగతిన వంతెన నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు అధికారులు కార్యాచరణను రూపొందిస్తున్నారు.

3,198 మంది లబ్ధిదారులకు మేలు..

కేసరపల్లి ఏలూరు కాలువ పక్కన సుమారు 88 ఎకరాల్లో ఈ జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. ఇక్కడ అభివృద్ధి చేసిన ఐదు లేఅవుట్లలో గన్నవరం, కేసరపల్లి, మరో ఐదు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 3,198 ప్లాట్లను కేటాయించారు. ఇప్పటికే కాలనీలో అంతర్గత రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయలను కల్పించారు. దీంతో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో గృహ నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఏలూరు కాలువ కట్టపై నుంచి రాకపోకలకు, గృహ నిర్మాణ సామగ్రి తరలించడానికి ఇబ్బందిగా మారింది.

ఎమ్మెల్యే వంశీ చొరవతో..

రహదారి సమస్యపై దృష్టి సారించిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఏలూరు కాలువపై వంతెన నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీనివల్ల కేసరపల్లి నుంచి అప్పారావుపేట మీదుగా జగనన్న కాలనీకి వెళ్లేందుకు దగ్గర మార్గం అవుతుందని ప్రతిపాదించారు. దీంతో ప్రభుత్వం వంతెన నిర్మాణానికి సుమారు మూడు కోట్ల రూపాయలను కేటాయించింది. అయితే భవిష్యత్‌లో జలరవాణా అవసరాల దృష్ట్యా వంతెన నిర్మాణం ఎత్తుపై ఇరిగేషన్ శాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో వంతెన నిర్మాణంలో మార్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అప్పారావుపేట వద్ద వంతెన నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు గుర్తించారు.

రైతులకూ ప్రయోజనమే..

గతంలో రైతులకు పంట పొలాలకు వెళ్లేందుకు గాను ప్రస్తుతం వంతెన నిర్మాణం చేయనున్న ప్రాంతంలో బల్లకట్టు ఉండేది. కొన్నేళ్ల క్రితం బల్లకట్టు శిథిలావస్థకు చేరగా పక్కన పెట్టడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. దీంతో కేసరపల్లి గ్రామంలోని వంతెన, అజ్జంపూడి వంతెన మీదుగా పొలాలకు వెళ్లిరావడం రైతులకు దూరాభారమైంది. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీ కోసం నిర్మిస్తున్న వంతెన వల్ల రైతులకు మేలు జరగనుంది. పొలాలకు వెళ్లేందుకు, పండించిన పంటను తీసుకువచ్చేందుకు ఈ వంతెన ఉపయోగంగా ఉంటుందని అన్నదాతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టల్, హోమ్ బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు



నియోజకవర్గానికి చెందిన పోస్టల్, హోమ్ బ్యాలెట్ బాక్సులు

గన్నవరం: గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పోస్టల్, హోమ్ ఓటింగ్ బ్యాలెట్లను సోమవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య మచిలీపట్నం తరలించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నమోదైన పోస్టల్ బ్యాలెట్లు, హోమ్ ఓటింగ్ బ్యాలెట్లను స్థానిక సబ్‌ట్రెజరీలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ బ్యాలెట్లను మచిలీపట్నంలోని జిల్లా ట్రెజరీకి తరలించేందుకు రాజకీయ పార్టీల ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో అధికారులు స్ట్రాంగ్‌రూమ్ సీలు తెరిచారు. అనంతరం పోస్టల్, హోమ్ బ్యాలెట్లను భద్రపరిచిన మూడు బాక్స్‌లను ప్రత్యేక వాహనంలో పోలీస్ భద్రత మధ్య మచిలీపట్నం తరలించారు. నియోజకవర్గానికి చెందిన మొత్తం 2,432 పోస్టల్, 272 హోమ్ బ్యాలెట్లను తరలించినట్లు ఉంగుటూరు తహసీల్దారు జేవీ సుబ్బారావు తెలిపారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.పవన్‌కుమార్, సబ్‌ట్రెజరీ అధికారి టి.నాగరాజు, ఎన్నికల డీటీ ఏఎస్ఆర్.గోపాల్‌రెడ్డి, రాజకీయ పార్టీల ఎన్నికల ఏజెంట్లు రామిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణారావు, జీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన



ఈడుపుగల్లు చెరువులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఏపీఓ రాజు

కంకిపాడు: లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులను చేపట్టారు. ఈడుపుగల్లు గ్రామంలో చెరువు పూడికతీత పనులను సోమవారం ఏపీఓ రాజు పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 8,999 జాబ్ కార్డులు ఇచ్చామన్నారు. 12,171 మంది కూలీలు ఉపాధి పథకాన్ని వినియోగించుకుంటున్నారన్నారు. ఈ 2024-25 సంవత్సరంలో రూ.493.06 లక్షలు వెచ్చించాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. పనులు చేసిన 15 రోజుల్లో కూలీల వ్యక్తిగత ఖాతాలకు సొమ్ము జమ అవుతుందన్నారు. సరాసరిన రూ.269 కూలీ అందుతుందన్నారు. పనులు సమర్థంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

కంకిపాడు: మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలు చేయాల్సిన నిర్వాహకులపై ఉందని ఎంఈఓ కె.ప్రసాద్ అన్నారు. ఎంఆర్సీ సెంటరులో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతాయుతంగా విద్యార్థులకు అందించాలని సూచించారు.

మండల స్థాయి వంటల పోటీలు

శిక్షణ కార్యక్రమం అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మండల స్థాయిలో వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జి.స్వప్న కుమారి (జెడ్పీ, నెప్పల్లి), ఏ.మల్లేశ్వరి (ఎంపీపీ, గొడవర్రు), ఎల్.వాకాలమ్మ (ఎంపీపీ, లక్ష్మీపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలను ఎంఈఓలు ప్రసాద్, శేషగిరిరావు అభినందించారు.

వంట ఏజెన్సీ నిర్వహకులకు శిక్షణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వం ప్రకటించిన నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన వంటలను విద్యార్థులకు అందించాలని బాపులపాడు ఎంఈవోలు శ్రీరామ్ బాలాసింగ్, బి.సురేష్ కుమార్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ నిర్వాహకులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ విధిగా పాటించాలని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులోనూ శ్రద్ధ వహించగలరని చెప్పారు. శిక్షణానంతరం వంట ఏజెన్సీ నిర్వాహకులకు నూతన మెనూ వంటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సావిత్రి (జెడ్పీహెచ్ఎస్, వీరవల్లి) మొదటి స్థానం సాధించగా, నిర్మల (జెడ్పీహెచ్ఎస్, మల్లవల్లి), రాధా (జెడ్పీహెచ్ఎస్, బాపులపాడు) ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరికి ఎంఈవోలు శ్రీరామ్ బాలాసింగ్, బి.సురేష్ కుమార్ ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ



ఉయ్యూరులో మాట్లాడుతున్న రీసోర్సు పర్సన్ స్వామినాయుడు



తెన్నేరు గ్రంథాలయంలో ఆటల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ముస్తాబాదలో డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు



ఆత్కూరులో వీరేశలింగం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పెనమలూరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించారు. అనంతరం విద్యార్థులు చెస్, క్యారమ్ బోర్డు, లూడో, మ్యూజికల్ చైర్, పలు ఆటలు ఆడారు. శాఖ గ్రంథాలయ అధికారిణి హరీషా మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారన్నారు. ఆటలతో పాటు పుస్తక పఠనం చేయటంతో రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టగలుగుతారని అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు.

ఉయ్యూరు: భాషానైపుణ్యంపై విద్యార్థులు పట్టుసాధిస్తేనే అవకాశాలను అందిపుచ్చుకోగలరని రీసోర్సు పర్సన్ స్వామినాయుడు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో సోమవారం స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ సైన్స్‌పై శిక్షణ ఇచ్చారు. రీసోర్సు పర్సన్లు స్వామినాయుడు, యశ్విత విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

కంకిపాడు: వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా తెన్నేరు శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. భగవద్గీత శ్లోకాల పఠనంలో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.సునీత పోటీలను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ వేసవి శిబిరాల ద్వారా వినోదం, విజ్ఞానం, నైపుణ్యత లభిస్తాయన్నారు.

గన్నవరం రూరల్: విద్యార్థులలోని సృజన వెల్లడికి సమ్మర్ క్యాంపులు ఎంతగానో దోహదం చేస్తాయని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం అధికారి కె.కృపానందం చెప్పారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చెప్పించారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కథలు చెప్పించటం, పుస్తకాలను చదివించటం చేయించారు.

ఉంగుటూరు: మండలంలో ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సోమవారం కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వీరేశలింగం పంతులు చేసిన సామజిక సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించడం, ఆటలు, లెమన్ స్పూన్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పిల్లలందరూ వేసవి సెలవులలో విజ్ఞాన శిబిరాలను సద్వినియోగించుకోవాలని కోరారు.

శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయ ఆదాయం రూ. 3.60లక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. హుండీ ఆదాయం రూ. 3.60 లక్షలు వచ్చినట్లు ఈఓ పి.మోహన్‌రావు తెలిపారు. మూడు నెలల 12 రోజుల కాలానికి మొత్తం నాలుగు హుండీలను లెక్కించామన్నారు.రూ.3,60,361, ఒక యూఎస్ డాలర్ వచ్చిందన్నారు. లెక్కింపులో వెండి, బంగారునాణెలు రాలేదని అన్నారు. భక్తులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, పోలీసుల సమక్షంలో లెక్కింపు జరిగిందన్నారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ ప్రసాద్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ ఏసీపీ దేవరకొండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఎన్ పురం, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా ఏకకాలంలో రైల్వేస్టేషన్, పార్శిల్ కార్యాలయం, వెస్ట్ ప్రవేశద్వారం పరిసరాల్లో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని వెయిటింగ్ రూమ్స్, డార్మెటరీలు, ప్రైవేటు రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, లాడ్జిలు, డార్మెటరీలను తనిఖీ చేసి అనుమానితులను ఐరిష్ సాయంతో వారిపై గతంలో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. గతంలో కేసులు ఉన్న ఇద్దరు పాత నేరస్తులను రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హోటల్‌లు, లాడ్జిలు, డార్మెటరీలలో అనుమానిత వ్యక్తులు, సరైన గుర్తింపు లేని వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఏసీపీ దేవరకొండ ప్రసాద్ యజమానులను ఆదేశించారు.

సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం



జగనన్న కాలనీలో నిర్మించిన ఇల్లు



జగనన్న కాలనీలో నివసిస్తున్న లబ్ధిదారులు

నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. గత టీడీపీ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ ఊసే లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇళ్లు లేని పేదవారికి ప్రభుత్వం ఇళ్లస్థలాలను పంపిణీ చేసింది. ఆ విధంగా ఇళ్లస్థలాలు పంపిణీ చేసిన లేఅవుట్లలో నున్న గ్రామం ఒకటి. విజయవాడ రూరల్ మండలంలోని ప్రధాన గ్రామాలైన నున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి, అంబాపురం గ్రామాల్లోని 5 వేల 681 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలను పంపిణీ చేశారు. ఇంత పెద్ద మొత్తంలో పేదలకు ఇళ్లస్థలాలను పంపిణీ చేసిన ప్రభుత్వం గతంలో ఎన్నడూలేదు.

నున్న గ్రామంలో నాలుగు లేఅవుట్లలో అతి పెద్ద లేఅవుట్-1లో 4,093 ప్లాట్లలో 606 కుటుంబాల వారు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని జగనన్న కాలనీ అనే కొత్త ఊరులో నివసిస్తున్నారు. పేదల సొంతింటి కల జగనన్న ప్రభుత్వం నెరవేర్చిందంటున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో ఉంటున్న తమకు సొంతగా ఇళ్లు ఏర్పాటు చేసుకోవడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమేనని లబ్ధిదారులు అంటున్నారు. నున్న లేఅవుట్-1లో మిగిలిన ఇళ్ల నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 44 ఇళ్లు శ్లాబు వేయగా, 171 ఇళ్లు రూఫ్ లెవెల్, 1,744 ఇళ్లు గోడల వరకు కట్టడాలు పూర్తి చేసుకొని ఉండగా, 1,516 ఇళ్లు పునాదులు వేసి వున్నాయి. మిగిలిన మూడు లేఅవుట్లలో మరో 146 కుటుంబాలు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని జగనన్న కాలనీల్లో నివాసం ఉంటున్నారు. మిగిలిన లబ్ధిదారులు వివిధ దశల్లో తమ ఇంటి నిర్మాణాలను వేగవంతంగా చేసుకొంటున్నారు.

రూ.1.30 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్..

ఇళ్లు నిర్మించుకొని ఉంటున్న కుటుంబాలకు రెండు కోట్ల 30 లక్షల రూపాయలతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించింది. వీధి లైట్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆయా కుటుంబాల వారికి ఉచితంగా విద్యుత్ మీటర్లు, సర్వీసు వైర్లు, బోర్డులను అందజేశారు.

రూ.1.40 కోట్లతో నీటి సౌకర్యం..

కోటి 40 లక్షల రూపాయలతో ప్రతి అయిదు ఇళ్లకు ట్యాప్ కనెక్షన్ ఇవ్వడం, పైపులైను నిర్మించడంతో నీటి సమస్య తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లేఅవుట్ ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్లు ఉపయోగ పడుతున్నాయి.

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడ్డాం. మా కుటుంబానికి నేడు జగనన్న ప్రభుత్వంలో సొంతిల్లు సమకూరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. మాతో పాటు వందలాది పేద కుటుంబాలు తమ సొంతింటి కల నెరవేరిందని ఆనందంగా నివసిస్తున్నారు.

–షేక్ హుస్సేన్, లబ్ధిదారుడు, నున్న గ్రామం



భయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద భక్తుల రద్దీ

హనుమజ్జయంతికి తరలివచ్చిన భక్తజనం

హనుమజ్జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. 1008 గులాబీ పూలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రఘు మిమిక్రీ, మ్యాజిక్ షో (భీమవరం), ఇంద్రజాల ప్రదర్శన, గాయకులు ఆలపించిన సినీ గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

–హనుమాన్‌జంక్షన్ రూరల్



మహిళల కోలాట ప్రదర్శన



అలరించిన రఘు మ్యాజిక్ షో

సీనియర్ ఎన్టీఆర్‌కు స్వరాంజలి

విజయవాడకల్చరల్: సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను ప్రణవీ మ్యూజిక్ అకాడమీ, డాక్టర్ ఎన్టీఆర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాయంలో సోమవారం నిర్వహించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ మంచి నటుడని అన్నారు.